

అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు

మంచిర్యాల కలెక్టర్, మే26 (ఆంధ్రజ్యోతి): తమకు పట్టాపాసు పుస్తకం ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమ కేసులు పెడుతూ వ్యవసాయం చేసుకోనివ్వడం లేదని వేమనపల్లి మండలం చామనపల్లి రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వేమనపల్లి చామనపల్లి శివారులోని సర్వే నెంబర్ 65, 67లో 1997లో అప్పటి ప్రభుత్వం సర్వే చేసి ఫైనల్ పట్టా జారీ చేసిందని తెలిపారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొత్త పాసుబుక్కులు మంజూరు చేశారు. జీవనాధారమైన భూములు అటవీశాఖ అధికారులు ఈ భూములు సాగు చేయవద్దని వేధిస్తున్నారని, సాగు చేస్తున్న 9మంది రైతులపై అక్రమ కేసులు బాయించి జైలుకు పంపారన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ స్పందిస్తూ అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏసీపీని, స్థానిక పోలీసులను ఆదేశించారు. రైతులను అక్రమంగా వేధిస్తే పోలీసు స్టేషన్‌లో అధికారులపై రైతులు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపుపై విచారణ



మాట్లాడుతున్న రైతులు

చెన్నూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వేరే ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని తీసుకువచ్చి అమ్ముతున్నారనే ఆరోపణలపై సోమవారం డీసీవో మోహన్ విచారణ చేపట్టారు. వేరే ప్రాంతం నుంచి ధాన్యం రాలేదని రైతులు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వారి వెంట ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏవో యామాని, సీఈవో లక్ష్మణ్‌రెడ్డి ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

మంచిర్యాల, మే26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్ల ను బదిలీ చేస్తూ కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న డి. సంతోష్‌ను మందమర్రికి బదిలీ చేశారు. పెద్దపల్లిలోనే పని చేస్తున్న బైరెడ్డి స్వప్నను బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. మంచిర్యాలలో విధులు నిర్వహిస్తున్న డి.వరలక్ష్మీని అదే కార్యాలయంలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తాండూర్‌లో పనిచేస్తున్న వీఈఆర్‌కేడీ ప్రసాద్‌ను మంచిర్యాలకు, మంచిర్యాల పౌరసరఫరాలశాఖలో పనిచేస్తున్న సాయి క్రిష్ణను వేమనపల్లికి, వేమనపల్లిలో పని చేస్తున్న ఎ. పోచయ్యను కన్నెపల్లికి, లక్షెటిపేటలో పనిచేస్తున్న సతీష్‌ను హాజీపూర్‌కు, మంచిర్యాలలో పని చేస్తున్న జె. సంతోష్‌కుమార్‌ను జైపూర్‌కు, బెల్లంపల్లి లోపని చేస్తున్న జె. కల్పనను తాండూ ర్‌కు, జైపూర్‌లో పనిచేస్తున్న సిహెచ్ మాధవిని మంచిర్యాల సివిల్ సప్లై విభాగానికి, మంచిర్యాలలో పని చేస్తున్న కె. శ్రావణని లక్షెట్టిపేటకు, బెల్లంపల్లిలో పని చేస్తున్న ఎంఎ హమీద్‌ను స్థానిక తహ సీల్దార్ కార్యాలయంలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కలెక్టరేట్ వద్ద పట్టా పాసుపుస్తకాలు ప్రదర్శిస్తున్న రైతులు

'సాగు' ముడి వీడేదెన్నడు..?



- పట్టాదారు పాసుపుస్తకాలున్నా సాగుకు నో
- గతంలోనే హక్కుపత్రాలు జారీ చేసిన ప్రభుత్వం
- అటవీ భూముల పేరుతో అడ్డుకుంటున్న అధికారులు
- బాధితుల్లో దళితులు, గిరిజన రైతులే అధికం
- జీవనాధారం లేకుండా పోయిందంటూ ఆవేదన
- ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

మంచిర్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల సమీపంలోని భూములు సాగు చేసుకునేందుకు ప్రభుత్వాలు వారికి అవసరమైన పట్టాపాసు పుస్తకాలు జారీచేశాయి. వాటిపైనే ఆధారపడి వందలాది కుటుంబాలు నేటికీ జీవనాధారం పొందుతున్నాయి. అయినప్పటికీ సాగులో ఉన్నవి అటవీ భూములనీ, వాటిలో వ్యయసాయం చేయడానికి వీల్లేదంటూ ఫారెస్ట్ ఆఫీసర్లు హుకుం జారీ చేస్తున్నారు. తమకు అన్ని ఆధారాలు ఉన్నాయని, ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించేవారిని జైలుపాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని వేమనపల్లి, భీమిని, నెన్నెల, భీమారం, చెన్నూరు, కోటపల్లి మండలాల్లో ఈ విధమైన సాగు వివాదం నెలకొనగా, న్యాయం చేయాలంటూ బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో 'సాగు ముడి' వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

హక్కు పత్రాలు జారీ చేసిన ప్రభుత్వాలు...

వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామంలో నిరుపేద దళిత, బలహీన వర్గాలకు చెందిన పలువురికి 1997లో అప్పటి ప్రభుత్వం అటవీ ప్రాంతాల సమీపంలోని భూములను అసైన్ చేసి, సాగు చేసుకునేందుకు హక్కు పత్రాలు జారీ చేసింది. చామనపల్లి శివారులోని సర్వే నెంబర్ 65,67లో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం ఫైనల్ పట్టా జారీ చేసింది. అప్పటి నుంచి పై సర్వే నెంబర్లలోని సుమారు 600ఎకరాల్లో లబ్ధిదారులు...

(తరువాయి 7లో)

అటవీ భూముల పేరుతో...

ఆయా మండలాల్లోని అటవీ భూముల్లో అక్రమంగా వ్యయసాయం చేస్తున్నారనే ఉద్దేశ్యంతో ఫారెస్ట్ అధికారులు రైతులను అడ్డుకుంటున్న సందర్భాలు జిల్లాలో అనేకం వెలుగు చూస్తున్నాయి. పోడు వ్యవసాయం పేరుతో అడవులను నరికివేస్తూ వ్యవసాయ భూములుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని దాడులు జరుపుతున్నారు. వాస్తవానికి ఎలాంటి హక్కు పత్రాలు లేక పోయినా కొన్ని ప్రాంతాల్లో రైతులు పోడు వ్యవసాయం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా తాము అటవీ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామంటూ అటవీ ప్రాంతాల రైతులు వాదిస్తున్నారు. సాగులో ఉన్న అటవీభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఆం దోళనకు దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎలాంటి హక్కులు లేవు కాబట్టి వారిని అటవీశాఖ అధికారులు వ్యవసాయం చేయకుండా అడ్డుకోవడం, కేసులు నమోదు చేయడం జరుగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా... ప్రభుత్వాలు పట్టా, పాసు పుస్తకాలు జారీ చేసనప్పటికీ కొన్ని చోట్ల అటవీ అధికారులు రైతులను అడ్డుకుంటున్న సంఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి. అక్రమంగా పోడు వ్యవసాయం చేస్తున్నారంటూ జిల్లాలోని వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన తొమ్మిది మంది రైతులపై కేసులు నమోదు చేసిన అటవీశాఖ అధికారులు 2024 డిసెం బరులో వారిని జైలుకు కూడా పంపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చెన్నూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వా మిపై కాంగ్రెస్ పార్టీలోని కొంత మంది నాయకులు పనిగట్టుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిపై అనుచితంగా మాట్లాడడం సరికా దన్నారు. ఎమ్మెల్యే వివేక్ ఏ పార్టీలోకి వెళ్తాడో అర్థం కావడం లేదంటూ రాష్ట్ర పరిశీలకుల ముందు ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీపై బురద జల్లడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వివేక్‌పై ఇలాంటి అసత్యపు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాపగౌడ్, నాయకులు హేమంతరెడ్డి, మహేష్ ప్రసాద్ తివారీ పాల్గొన్నారు.

యాప రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



కొండాపూర్ యాపరోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న జైపూర్ సిమెంట్ కంపెనీ కార్మికులు

కాసిపేట, మే26(ఆంధ్రజ్యోతి): సోమగూడెం నుంచి దేవాపూర్‌కు వెళ్లే ప్రదాన రహదారి కొండాపూర్‌యాప వద్ద ఏర్పడ్డ గుంతలను దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మండలంలో నాలుగు రోజులు కురిసిన వర్షాల వల్లకొండాపూర్ యాప ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇటీవల స్థానికులు ఆందోళనలు పలు సందర్భాల్లో నిరసనలు తెలిపిన నేపథ్యంలో దేవాపూర్ పోలీసులు స్పందించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

దేవాపూర్ సిమెంట్ కంపెనీ నుంచి మట్టి, సిమెంట్, మొరం తీసుకొచ్చి గుంతలు పూడ్చివేశారు. ప్రయాణికులు కొండాపూర్ యాపవద్ద జాగ్రత్త వహించాలని ప్రయాణికులకు సూచించారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, మే26(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నర్వాయిపేట గ్రామానికి చెందిన జాడిశంకర్ మండలంలోని మెట్‌పల్లి శివారులో తనకు గల పట్టా భూమి వేరొకరి పేరిట చూపుతోదని, సవరించి తన పేరిట మార్పు చేసి పట్టాపాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన బోయిన రవీందర్, నెన్నెల మండలం మెట్‌పల్లి గ్రా మానికి చెందిన దుగుట రాజేశ్వరి తమ ప్రాంతంలో మీ సేవా కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మీసేవా కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ అర్జి సమర్పించారు. జన్నారం మండలం ఇంధ న్‌పల్లి గ్రామానికి చెందిన లసెట్టి గంగవ్వ గ్రామశివారులో తనకు గల భూమికి సంబంధించి హద్దులు నిర్ధారించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 32దరఖాస్తులు వచ్చాయని, అందిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాసరావు, హరిక్రిష్ణలతో కలిసి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా

● మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలక్రైం, మే26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కక్ష పూరితంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన హయాంలో ఎటువంటి లాభాపేక్షలేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. మంచిర్యాల జిల్లాకే ఎల్లంపల్లి ప్రాజెక్టు తలమానికమన్నారు. దాని వల్లనే లక్షల ఎకరాల్లో వ్యవసాయం సాగవుతోం దన్నారు. గూడెంలిఫ్ట్, చెల్లంపేట్ లిఫ్టను వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గుర్తు చేశారు. గ్రామాల్లో రోడ్ల సౌకర్యం, మంచినీటి సదుపాయాలు కల్పించామన్నారు. తమ హయాంలోనే మెడికల్ కళాశాల, నూతన కలెక్టరేట్ మాతాశిశు ఆసుపత్రులను నిర్మించామన్నారు. అభివృద్ధి పేరుతో పీఎస్‌ఆర్ నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సింగిల్‌గా వస్తాను చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విజిత్‌రావు, పెంట రాజయ్య, గాదె సత్యం, పల్ల భూమేశ్, బేర సత్యనారాయణ, దొమ్మటి సత్యం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

టాలెంట్ టెస్టును రద్దు చేయాలి

● పీడీఎస్‌యూ నాయకులు

మంచిర్యాలకలెక్టరేట్, మే26 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో నార్త్‌ఇన్ హోటల్లో మే27న హైదరాబాద్‌కు చెందిన రెసో నాన్స్ పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసోనాన్స్ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అధికారులకు తెలియకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తూ టాలెంట్ టెస్ట్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మభ్య పెడుతూ వేలరూపాయలు దోచుకోవడం కోసమే అన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం వలన తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు మనస్తాపానికి గురై ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి డీఈవో స్పందించి టాలెంట్ టెస్టు రద్దయ్యే విధంగా చూడాలన్నారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ

మంచిర్యాలకలెక్టరేట్, మే26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి వరిధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ ఒకప్రకటనలో తెలిపారు. జిల్లాలో 320 కేంద్రాల ద్వారా 22వేల 20మంది రైతుల వద్ద నుంచి లక్ష57వేల 710టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాల్లో 218కోట్ల 13లక్షల రూపాయలు జమ చేసినట్లు పేర్కొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలక్రైం, మే26(ఆంధ్రజ్యోతి): అధికారుల ఫొటో, పేర్లతో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పేరుమీదనే ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి ప్రజలు సైబర్ నేరగాళ్ల మోసం చేస్తున్నారని, అధికారుల ఫొటో పేర్లతో ఫేస్‌బుక్, వాట్సాప్ అకౌంట్ క్రియేట్ చేసి అందరికి ఫ్రెండ్ రిక్వేస్టులను ఆక్సెప్ట్ చేసి వారి వద్ద నుంచి డబ్బులు అడు గుతున్నారని అధికారి, ఫ్రెండు, బంధువులు, ఆర్మీ అధికారి ట్రాన్స్‌ఫర్ కావడంవల్ల ఇంటికి సంబంధించిన సామానులు తక్కువ ధరకు అమ్ము తున్నామని కొత్తరకం మోసాలకు పాల్పడుతున్నారని పోలీసు అధికారుల ప్రొఫైల్ ఫొటోతో చాట్ చేయడం వల్ల ప్రజలు నిజంగానే పోలీసు అధికారిచాట్ చేస్తున్నాడని భావిస్తూ కొందరు అమాయ కులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారని సైబర్‌నేర గాళ్లు రోజురోజుకు పెట్రేగిపోతున్నారని పేర్కొన్నారు. కొంత కాలం క్రితం సామాన్యులే దీనికి బలయ్యేవారని ప్రముఖులు, పోలీసు అధికారుల పేర్ల నకిలీ అకౌంట్లు తెరిచి వారే మాట్లాడుతున్నట్లు అవతలివారిని నమ్మించడం వల్ల మోసానికి గురవుతున్నారని తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వేస్టులను ఆక్సెప్ట్ చేయడం చేయరాదని సూచించారు. ప్రజలు సైబర్ నేరగాళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలి తెలియని అపరిచితులతోచాటింగ్ చేయరాది సూచించారు.

అర్హులకే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

● ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులకే సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందిస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు వెళ్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. సోమవారం మంద మర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తమ 15నెలల పాలనకు చాలా తేడా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం కోలు కోలేని విధంగా దెబ్బతిందని, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని, అప్పులకుప్పగా మార్చారన్నారు. అయినా సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలో 3వేలమంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. అర్హులైన వారందరికి గృహాలు వస్తాయని, అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు చాలా మంది రైతులు నష్టపోయారని, చేతికి వచ్చిన పంట తడిసి ముద్ద అయ్యిందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామన్నారు. నియోజకవర్గంలో అమృత పథకం కింద వంద కోట్లు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, దుర్గం నరేష్, బండి సదానందం, రమేష్, తిరుమల్ పాల్గొన్నారు.

●మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు కుమారుడు సుహాస్ వివాహం మూడు రోజుల క్రితం జరగగా సోమవారం స్థానిక పాత బస్టాం డ్‌లోని కమిషనర్ నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆశీర్వదించారు.

పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, మే26(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకొని మాట్లాడారు. మున్సిపాలిటిలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు వార్డులోకి అంబులెన్స్‌లు కూడ వెళ్లలేని విధంగా నిర్మాణాలు చేపట్టారని మున్సిపల్ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వార్డు సభల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. పట్టణంలో నివాసం ఉంటున్నవారికి జీవో 58, 59 ప్రకారం ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలువార్డుల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లేని చోట పనులు ప్రారంభించి నీటిని అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా రాజమౌళి, సహాయ కార్యదర్శిగా బొల్లం తిలక్, కోశాధికారిగా మంతెన రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, ఉపేందర్, రాంచందర్, శంకర్, పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు.. కనెక్షన్ మరిచారు



కనెక్షన్ ఇవ్వని ట్రాన్స్‌ఫార్మర్

ఆసిఫాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని పైకాజీనగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించి కనెక్షన్ ఇవ్వడంలో విద్యుత్ అధికారులు కాలయాపన చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో లో వోల్టేజీ సమస్య ఉండడంతో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయింది. అధికారులు దానిని బిగించినా కనెక్షన్ ఇవ్వలేదు. ఈ విషయమై సోమవారం కాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

ఆసిఫాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అన్నారు. సోమవారం చిర్రకుంట ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలో ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలను తప్పకుండా ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలను అందించాలని సూచించా రు. సమావేశంలో హెచ్ఎం జలపతిరావు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తుగా మూడు నెలల రేషన్ బియ్యం

జిల్లాలోని రేషన్ కార్డులు	1,26,865
అంత్యోదయ ఆహార భద్రత కార్డులు	13,191
అన్నపూర్ణ అన్నయోజన కార్డులు	20
మొత్తం లబ్ధిదారులు	4,55,257

- జిల్లాలో లబ్ధిదారులు 4,55,257 మంది
- మూడు నెలలకు తొమ్మిది వేల మెట్రిక్ టన్నులుగా అంచనా
- గదులు, గిడ్డంగులు లేక అధికారులు, డీలర్ల ఇబ్బంది



కాగజ్‌నగర్ టౌన్, మే 26 : రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల ముప్పు కారణంగా ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఒకేసారి మూడు నెలల రేషన్‌బియ్యాన్ని పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదు ఎం ఎల్ ఎస్(మండల లెవల్ స్టాకిస్టు) పాయింట్లలో నుంచి బియ్యాన్ని ఒక్కో ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలిస్తోంది. జూన్, జూలై, ఆగస్టునెలల రేషన్ బియ్యాన్ని వచ్చేనెలలో పంపిణీ చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్‌షాపులు, ఇతర గోదాంలను సిద్ధం చేస్తున్నారు. ఆయా చోట్ల ఉండే సమస్యలను సర్వే చేయిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రేషన్ షాపులో నిలువ చేసుకునే సమస్యలతో పాటు ఇతర సౌకర్యాలు తదితర విషయాలను తెలుసుకుంటున్నారు.

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా దుకాణాలకు సరఫరా చేసేందుకు బియ్యం కాగజ్‌నగర్ గోదాముకు తరలించారు. ఆసిఫాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఇంకా మొదలు కాలేదు.

జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మెట్రిక్ టన్నులు

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాల వ్యాప్తంగా 335 గ్రామపంచాయతీలున్నాయి. ప్రజలకు బియ్యం పంపిణీ చేసేందుకు 314 రేషన్‌షాపులు ఉన్నాయి. నెలకు సుమారు మూడువేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్, సిర్పూర్(టి), బెజ్జూరు మండలాల్లో ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాకిస్టు పాయింట్) గోదాములున్నాయి. వీటినుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 4,55,257 మంది రేషన్ లబ్ధిదారులున్నారు. ఇందుకు గానూ ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ చేస్తుండగా లబ్ధిదారుల నుంచి మరింత డిమాండు పెరిగిందని అంటున్నారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఇప్పటికే పలు లారీల్లో సన్న బియ్యం చేరవేశారు. ఇంకా గోదాములో దొడ్డు బియ్యం ఉండ డంతో స్థలాభావం ఏర్పడుతోంది. బియ్యం నిల్వ చేసేందుకు సరిపడా గదులు లేకపోవడంతో ఆయా షాపుల యజమానులు గిడ్డంగుల్లోనే ఉంచి విడతల వారీగా పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్‌కు చెందిన రేషన్ డీలర్లు సమావేశ ఏర్పాటు చేసుకొని చర్చించారు. అయితే ఉన్నతాధికారుల నుంచి స్పష్ట మైన ఆదేశాలు రావాల్సి ఉన్నాయని గోదాముల ఇన్ చార్జిలు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మూడునెలల రేషన్‌బియ్యం ఒకేసారి సరఫరా చేయాలని కీలక ఆదేశాలు జారీ చేయడంతో ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పౌరసరఫరా శాఖాధికారులు కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా రేషన్ దుకాణాల్లో కూడా స్థలం తక్కువగా ఉంది.

● పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలు..

ఒక్క కాగజ్‌నగర్ ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే 20కి పైగా లారీల మేర ఇంకా దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. ఈ దొడ్డు బియ్యం ఇంకా తరలించక పోవడంతో గోదాముల్లో స్థలం లేకుండా పోయిందని సిబ్బంది పేర్కొంటున్నారు. కొద్దినెలలుగా దొడ్డు బియ్యం ఇక్కడే ఉండడం మరి కొద్దినెలలు ఇలాగే ఉంటే బియ్యం పురుగులు పట్టి పనికిరాకుండా పోయే అవకాశాలున్నాయి. దొడ్డు బియ్యం వెంటనే ఇక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తే మరింత ఖాళీ స్థలం ఏర్పడు తుంది. అలాగే ప్రతీ ఎంఎల్ఎస్ పాయింట్ లోనూ ఇంకా దొడ్డు బియ్యం ఉన్నట్లు తెలుస్తోంది.

బాల్యం నుంచి వ్యాయామం అలవాటు చేసుకోవాలి

- ఏఎస్పీ చిత్తరంజన్



కిడ్స్ జోన్ ప్రారంభం సందర్భంగా పిల్లతో ఏఎస్పీ చిత్తరంజన్

వాంకిడి, మే 26 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే వ్యాయామం, ఆటలు, పాటలు అలవాటు చేసుకోవాలని ఆసిఫాబాద్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలో పాత పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కిడ్స్ జోన్‌ను ఏఎస్పీ చిత్తరంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో సరదాగా మాట్లాడారు. వాంకిడి పోలీసుస్టేషన్ క్వార్టర్స్‌లో నివసించే చిన్నారులు, బయటి విద్యార్థులు కిడ్స్‌జోన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆటలు ఆడుతూ, వ్యాయమం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల న్నారు. పోలీసుస్టేషన్‌లో పిల్లల కోసం కిడ్స్ జోన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ప్రశాంత్, మధుకర్, ఏఎస్ఐ పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో కోట ప్రసాద్

కాగజ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని రేగులగూడ, కోసిని, చింతగూడ నర్సరీలను సోమవారం కాగజ్‌నగర్ ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహణ తీరు, వివిధ సమస్యలపై సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పనులు పూర్తి స్థాయిలో చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో వెంట ఏపీవో చంద్రశేఖర్, సలీం, హరీష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దహెగాం, మే 26 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి దహెగాం పోలీసుస్టేషన్‌లో ఎస్సై విక్రమ్ సోమవారం అందజేశారు. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన జి సంతోష్ సెల్‌ఫోన్ పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


మంచిర్యాలక్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ అథ్లెటిక్స్ 2025 పోటీలకు మంచిర్యాలలోని శ్రీచైతన్య విద్యార్థులు ఎంపికయ్యారు. మంచిర్యాల డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సంజు అభినందించారు. అండర్-12 బాలికల విభాగంలో లాంగ్‌జంప్, 60మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో ఈ. అనుకీర్తన, అండర్-10 బాలికల విభాగంలో జావలిన్‌త్రో ద్వితీయ స్థానం లో సహస్ర, అండర్-8 జావలీన్ త్రో బాలుర విభాగంలో సాయినిహాల్, ద్వితీయ స్థానం లో నిలిచారు. అభినందించిన వారిలో జోనల్ పీఈటీ రాజేందర్, కుమారస్వామి, విలాస్, అక్షయ్ కుమారస్వామి, అనూష, రేఖల తదితరులు ఉన్నారు.

పోడు రైతులు అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

పెంచికలపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పోడు రైతులు ఎవరు అధైర్య పడొద్దని అండగా ఉంటానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని జైహింద్‌పూర్ గ్రామ శివారులో బెజ్జూరు అటవీ శాఖాధికారులు పోడు భూములను చదును చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా పోడు రైతులు అధికారులను అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఇప్పుడు ఇందులో మొక్కలు నాటడం అన్యాయమని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులతో మాట్లాడుతూ పోడు రైతుల సాగును అడ్డుకోవడం అన్యాయమని ఆయన అన్నారు. పోడు వ్యవసాయం అడ్డుకుని రైతులను ఇబ్బంది పెట్టి వారి జీవనోపాధికి అంతరాయం కలిగించవద్దని అధికారులకు సూచించారు. రెండురోజుల క్రితం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ సంవత్సరం పోడు భూముల్లో చెట్లు నాటేది లేదని అటవీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. మంత్రి వ్యాఖ్యలకు అనుగుణంగా చర్యలు తీసుకొని పోడు రైతులకు సహకరించాలని ఆయన సూచించారు. కొత్తగా అటవీ భూమిని ఆక్రమించవద్దని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో బెజ్జూరు ఎఫ్ఆర్వో శ్రావణ్‌కుమార్, సీఐ శ్రీనివాస రావు, ఎస్సైలు కొమురయ్య, ప్రవీణ్, విక్రమ్, మహేందర్, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



క్రీడాకారులను అధికారికంగా సన్మానించాలి

శ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి క్రీడాకారులను అధికారికంగా సన్మానించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి చెందిన 11 ఏరియాల నుంచి 58 మంది ఉద్యోగులు జాతీయ స్థాయిలో క్రీడా, కళారంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారన్నారు. గనులు, విభాగాల్లో పనిచేస్తూ కోల్ ఇండియా, ఆల్ ఇండియా, పబ్లిక్ సెక్టార్ క్రీడాపోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులు, కళాకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. యాజమాన్యం స్పందించి, తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

వార్షిక లాభాలను వెంటనే ప్రకటించాలి

శ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థకు చెందిన నిధులతో ఉస్మానియా యూనివర్సిటీకి డిజిటల్ క్లాసులు, ఇతర సదుపాయాలు కల్పించడం సంతోషమన్నారు. అదేమాదిరిగా సింగరేణి ఉద్యోగులు శ్రమతో సాధించిన లాభాలను ప్రకటించి వెంటనే పంపిణీ చేయాలని యాజమాన్యాన్ని కోరారు. అంతేకాకుండా ఉద్యోగుల పిల్లలకు అవసరమైన నాణ్యమైన విద్యను అందించేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వార్షిక లక్ష్యాలను సాధించాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

శ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): వార్షిక బొగ్గు ఉత్పత్తి సాధించడానికి ఉద్యోగులు కృషి చేయాలని కార్పొరేట్ జనరల్ మేనేజర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) మనోహర్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఆయన ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్ గనుల నెలవారీ, వార్షిక ఉత్పత్తి సాధనపై సమీక్ష నిర్వహించారు. ఆర్‌కే 7 గనిలో ఆయన మాట్లాడుతూ, ఆర్‌కే 7 వార్షిక లక్ష్యం మూడు లక్షల 60 వేల టన్నులు, నెలవారీగా 30 వేల టన్నుల బొగ్గును సాధించాలన్నారు. రక్షణను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. అలాగే ఆర్‌కే న్యూటెక్ గనికి వార్షిక లక్ష్యం లక్ష 60 వేల టన్నులు, నెలవారీగా 13 వేల 500 టన్నులు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఎస్టీపీపీ నుంచి బాటమ్ యాష్ వినియోగాన్ని పెంచే ప్రయత్నాలు చేయాలన్నారు. ఉత్పత్తి పెంచి, వ్యయం తగ్గించేందుకు కృషిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌కే 7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్, ఆర్‌కే 7 మేనేజర్ తిరుపతి, ఆర్‌కే న్యూటెక్ మేనేజర్ స్వామిరాజు, ఎస్ఈ(ఐఈడీ) కిరణ్ కుమార్, సర్వేయర్లు తిరుపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజారక్షణకు చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సర్వేయర్‌కు మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రాబోతున్నందున ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో తహసీల్దార్లు, నీటి సరఫరా, పంచాయతీరాజ్, మండల పరిషత్ అధికారులతో ప్రకృతి వైపరీత్య పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం రాబోతుందని, జిల్లాలోని లోతట్టు గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల కారణంగా ఏర్పడే వరద ప్రభావంతో రహదారులు దెబ్బతినకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో జిల్లాలో ఏర్పడే ప్రకృతి వైపరీత్యాల పరిస్థితుల్లో అధికార యంత్రాంగం సమష్టిగా పనిచేసి ప్రజలకు భరోసా అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సర్వేయర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

లైసెన్స్ సర్వేయర్లకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో లైసెన్స్ సర్వేయర్ కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు భూభారతి చట్టం, భూమి కొలతలపై రెండు నెలల శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా భూమి కొలతల అధికారి సోమేశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకమైం దన్నారు. భూభారతి చట్టంతో పాటు భూమి కొలతల లో ప్రతీఅంశంపై అవగాహన ఉండాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంక టేష్ దోత్రే సూచించారు. సోమవా రం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా సహకార శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిర్దేశించిన ప్రకారం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని, సమన్వయంతో లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రైతు యువ వికాసం పథకంలో భాగంగా అర్హుల జాబితా తయారు చేయాలని, జాబితా రూపకల్పనలో వందశాతం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా అర్హుల జాబితా తయారు చేసి అందించాలని ఆదేశించారు.

వంద శాతం అడ్మిషన్లు జరిగేలా చూడాలి

జిల్లాలోని మైనార్టీ రెసిడెన్షియల్ సంస్థలో వంద శాతం అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో తెలంగాణ మైనార్టీ విద్యా సంస్థలలో అడ్మిషన్లకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మైనార్టీ రెసిడెన్షియల్ సంస్థలో వంద శాతం అడ్మిషన్లు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతి కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ఎంఏ నదీం, ఆర్‌ఎల్‌సీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉంది

కాగజ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమాజం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం ట్వీట్ చేశారు. వ్యక్తిగతంగా దూషించిన వ్యక్తిని బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకున్నందుకే తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశాననడం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పేర్కొనడం ఎంతవరకు సమంజసం అన్నారు. కష్టకాలంలో పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మరెందరో కోనేరు కోనప్ప లాంటి అవకాశాలు వాదులు పార్టీని వీడినట్టు పేర్కొన్నారు. కోనప్పపై వ్యక్తిగతంగా ఎలాంటి కక్షలు లేవని పేర్కొన్నారు. తెలంగాణ అంతా కూడా కేసీఆర్ వెంటనే ఉందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయే రోజుల్లో తెలంగాణను కాంగ్రెస్ పార్టీ నుంచి విముక్తి చేసి అధికారంలోకి తప్పక వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రాలీ ఆటో బోల్తా

ఆసిఫాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఒక వాటర్ ప్లాంట్‌కు చెందిన ట్రాలీ ఆటో వాటర్ క్యాన్లతో సహా కలెక్టరేట్‌లో బోల్తా పడింది. ప్రతి రోజులాగే కలెక్టరేట్‌లో నీటి సరఫరా కోసం చల్లటి క్యాన్లతో ట్రాలీ ఆటోను తీసుకు వస్తుండగా లోపల కుడి వైపు తిరిగే సమయంలో వేగంగా నడపడంతో ఒకేసారి అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీ డ్రైవర్‌తో పాటు అందులో కూర్చున్న బాలుడికి తృటిలో ప్రమాదం తప్పింది. ఆటో ముందు భాగంగా పూర్తిగా దెబ్బతింది.

బ్యాంక్ సేవలపై అవగాహన

లక్సెట్టిపేట(దండేపల్లి), మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట గ్రామంలో ఎస్ బీఐ సిబ్బంది బ్యాంక్ సేవలపై సోమవారం ఉపాధి హామీ కూలలకు అవగాహన కల్పిం చారు. బ్యాంక్ మేనేజర్ శ్రీనాథ్ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాలోని రకాలు, ఆర్థిక ప్రణాళి క, బడ్జెట్ కేటాయింపు, డిజిటల్ ఖాతాల్లోని రుణ సదుపాయాల రకాలుతోపాటు అద నపు ప్రయోజనాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్బీఐ దండేపల్లి క్లైన్సిలర్ రవీందర్, సీఎల్ఎఫ్ కౌన్సిలర్ గుడికందుల హరీష్, నూతన్‌కుమార్, రాకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

రామకృష్ణాపూర్, మే26 (ఆంధ్రజ్యోతి): పొలంలో విద్యుత్ తీగలు అమర్చి 13 గేదెల మృతికి కారకుడైన జి నర్సయ్యను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అనుమతులు లేకుండా పొలం చుట్టు విద్యుత్ తీగలు అమర్చడంతో మూగజీవాలు మృతి చెందాయని నర్సయ్యపై విద్యుత్ ఆక్ట్ ప్రకారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా విద్యుత్ తీగలు అమరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులపై దాడి

చెన్నూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబడిపల్లి గ్రామంలోని మాజీ సర్పంచ్ ఆలోతు లక్ష్మీప్రియ ఇంటిపైకి వచ్చి ఆమెపై, ఆమె కుటుంబ సభ్యులపై కొందరు స్థానికులతో పాటు వేరే గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని సోమవారం మాజీ సర్పంచ్ ఇంట్లోకి చొరబడి దాడి చేయడమే కాకుండా ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ విషయంపై బాధితులు చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

నెన్నెల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన గడ్డి బీరయ్య అనే యువకుడిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపా రు. ఆదివారం రాత్రి మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకిదూరి చేయిప ట్టి లాగాడని తెలిపారు. ఆమె కేకలు వేస్తూ తప్పించుకొని పారిపోయిందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

లక్షెట్టిపేట, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి 1,860 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

హాజీపూర్: పచ్చిరొట్టే విత్తనాలైన జనుములు అందు బాటులో ఉన్నట్లు ఏవో క్రిష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని పడ్తన్‌పల్లి పీఏసీఎస్‌లో సొసైటి చైర్మన్ రామారావు, డైరెక్టర్లతో కలిసి రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం 173 సంచులు అందు బాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్‌తో సంబంధిత రైతు వేదికల్లో ఏఈఓలను సంప్రదించాలి కోరారు.

మందమర్రిరూరల్: మండలంలోని మామిడిగట్టు గ్రామంలోని ఊర చెరువుకు కొత్త తూములు నిర్మించాలని మాజీ సర్పంచు కోట రాయలింగు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు ఫిర్యాదు అందించారు.

● ఆదిల్‌పేట గ్రామంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు సునీతదేవి, తిరుపతి పాల్గొన్నారు.

మంచిర్యాలకలెక్టర్: హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ శివారులో తమకున్న 17గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన వంగపల్లి గంగారావు దొర కొడుకు, వంగపల్లి మనోహర్‌రావు తమ భూమి అంటూ ఇబ్బందులు పెడుతున్నారని నీరటి రామక్క సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రంగారావు కుమారులు వంగపల్లి మనోహర్ రావు కాగితాల్పై సంతకాలు చేయాలని బెదిరిస్తున్నారన్నారు. ఆయన అనచరులు కూడ ఇంటికి వచ్చి చంపుతామని బెదిరిస్తున్నారని తనకు న్యాయం చేసే విధంగా చూడాలన్నారు.

బెల్లంపల్లి: కన్నాల గ్రామ పంచాయతీలోగల శ్రీబుగ్గరా జరాజేశ్వర ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన నర్సయ్య, మాధవిలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాండూర్ : రైతుల గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని ప్రతి రైతుకు ఆధార్ మాదిరి 11 అంకెలతో కూడిన ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తూ గుర్తింపు కార్డుల జారీకి చర్యలు చేపడుతుందని మండల వ్యవసాయాధికారి సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి రైతులకు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ జరుగుతుందని, రైతులందరు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌ల, సెల్‌ఫోన్ లతో వచ్చి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సరస్వతి విగ్రహం వద్ద మంత్రి శ్రీధర్‌బాబు, తదితరులు



కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



శివుని ప్రతిమ వద్ద భక్తుల కోలాహలం



హారతిని తిలకిస్తున్న భక్తులు





హారతినిస్తున్న కాశీ పండితులు

ముగిసిన సరస్వతి పుష్కరాలు

- చివరి రోజు 2.25 లక్షల మంది పుణ్యస్నానాలు
- మొత్తంగా 15.90 లక్షల మంది భక్తుల రాక

భూపాలపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలు సోమవారంతో ముగిశాయి. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రోజూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పుష్కరాలను విజయవంతం చేసింది. చిన్నచిన్న అవాంతరాలు మినహాయిస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పుష్కరాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ఘనంగా చేసింది. ఈ పుష్కరాలకు 15.9 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. చివరి మూడు రోజుల్లోనే సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. పుష్కరాల్లో చివరి రోజైన సోమవారం 2.25 లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

● ట్రాఫిక్ సమస్యలు

పుష్కరాలకు ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల మంది వస్తారని అంచనా వేయగా ఎవరూ ఊహించని రీతిలో సంఖ్య 16 లక్షలకు చేరుకోవడంతో అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భక్తుల సంఖ్య ఊహించని రీతిలో ఉండడంతో సదుపాయలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సరిగ్గా లేకపోవడంతో పుణ్యస్నానాల కోసం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు.

● వైభవంగా త్రివేణిసంగమ నవరత్నమాల హారతి

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఏడు నుంచి 7.45గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు విజయవంతం కావడం, 12రోజుల పాటు ప్రజలందరికీ శ్రేయస్సును, శుభాన్ని కల్గించాలని నదీమాతకు నవరత్నమాలహారతి సమర్పించడం ఆనందకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాసరాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్‌మోహన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ పాల్గొన్నారు.





రోడ్డుపై ఇసుక మేటలు ...



రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

హాజీపూర్, మే26 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలంలోని జాతీయ రహదారిపై పేరుకుపోయిన ఇసుకతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ముల్కల్ల రాళ్లవాగు బ్రిడ్జి దాటగానే ఇసుక రీచ్ దారి వుంటుంది. అక్కడ నుంచి ట్రాక్టర్ డ్రైవర్లు దూసుకువస్తారు. ఈ నెల 15వ తేదీన అక్కడ ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా వచ్చి తాకడంతో గుడిపేట్‌కు చెందిన బయ్య మధూకర్ అక్కడికక్కడే చనిపోయాడు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ట్రాక్టర్లు వందల సంఖ్యలో నడుస్తుండడంతో జాతీయ రహదారిపై ఇసుక పేరుకుపోయి ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు రహదారిపై ఇసుక, మరోవైపు విపరీతమైన దుమ్ముతో వాహనదారులు కళ్లు, ముక్కు మూసుకొని వాహనాలు నడిపే పరిస్థితి ఉంది. గుడిపేట్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ముందు బస్‌స్టాప్ వద్ద 13వ బెటాలియన్ ముందు కూడా ఇదే పరిస్థితి ఉంది. అక్కడ కూడ రోడ్డుకు సగభాగం వరకు ఇసుక మేట వేసింది. తరచు అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధిఆరులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో శత్రుదేశాల్లో వణుకు



బెల్లంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి, మే26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌తో శత్రుదేశాల్లో వణుకు పుట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అము రాజుల శ్రీదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని టేకుల బస్తీ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీజేపీ నాయకులతో కలిసి తిరంగ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీని చేపట్టామన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌తో శత్రుదేశాలక ముచ్చ మటలు పట్టాయన్నారు. నాయకులు కోడి రమేశ్, రాచర్ల సంతోష్, కళ్యాణి, కేశవరెడ్డి, గోవర్ధన్, పాల్గొన్నారు.

నియామకం

లక్సెట్టిపేట(దండేపల్లి), మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆల్‌స్టైల్స్ కుంగ్‌ఫూ ప్రధానకార్యదర్శిగా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు రాయమల్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో కుంగ్‌ఫూ నూతన కార్యవర్గంను కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, ట్రెజరర్‌గా ఎనగందుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కోడూరి శేఖర్, చందనం రాజేందర్, బద్దెనపల్లి రాజు, జాయింట్ సెక్రటరీలుగా కస్తూరి పవన్, దివ్య, శ్రీనివాస్‌లను ఎన్నుకోవడం జరిగింది.

‘సాగు’ ముడి వీడేదెన్నడు..?

(5వ పేజీ తరువాయి)

సాగు చేస్తున్నారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత కూడా అప్పటి ప్రభుత్వం 2018లో కొత్త పట్టా పాసు పుస్తకాలు మంజూరు చేసింది. వర్షాధార భూములు కావడంతో ప్రతి వానాకాలంలో ఆయా భూములను లబ్దిదారులు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండటంతో భూములను సిద్ధం చేసుకొనేందుకు వెళ్లిన రైతులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నట్లు చెబుతున్నారు. ఆయా భూముల్లో రైతులు బోర్లు, స్తంబాలు, విద్యుత్ మోటార్లు కూడా ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇదే పద్ధతిలో నెన్నెల, భీమిని, భీమారం, చెన్నూరు, కోటపల్లి మండలాల్లోనూ సుమారు ఐదు వేల ఎకరాల్లో రైతులు అటవీప్రాంత భూములను సాగు చేసుకుంటుండగా, వారిలో చాలా మందికి హక్కు పత్రాలు ఉన్నప్పటికీ అటవీ అధికారులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో వెలుగులోకి..

తెలంగాణ ప్రభుత్వం నుంచి పట్టా పాసు పుస్తకాలు పొందిన తరువాతనే తాము అటవీ ప్రాంత భూముల్లో సాగు చేసుకుంటున్నామని, అయినప్పటికీ అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని పేర్కొంటూ సోమవారం చామనపల్లి గ్రామస్థులు పలువురు కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన పాసు పుస్తకాలను వారు ప్రదర్శించారు. భూములను సాగు చేస్తే కేసులు పెడతామని అటవీ అధికారులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారులు తమ భూముల్లోకి రాకుండా, తమపై అక్రమ కేసులు నమోదు చేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా హక్కులు పత్రాలు ఉన్న వారికి అటవీ ప్రాంత భూములు సాగు చేసుకునేలా న్యాయం జరుగుతుందో...లేదో వేచి చూడాలి.

వేమనపల్లి తహసీల్దార్‌గా సంధ్యారాణి

వేమనపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి నూతన తహసీల్దార్‌గా సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దండే పల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌గా పనిచేసిన రమేష్ పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయి వెళ్లిపోయారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

జన్నారం, మే26 (ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో, విద్యా, ఉద్యోగాల్లో, ప్రమోషన్లలో 42 శాతం రిజర్వేషన్లు అమలుపరుచాలని మండల బీసీ సంఘం అధ్యక్షులు గూడ అశోక్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం ఆమో దించిన 42శాతం రిజర్వేషన్‌ను కామరెడ్డి డిక్లరేషన్ ప్రకారం అమలు పరుచాలన్నారు. బీసీ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ చంద్రయ్య, పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

శ్రీరాంపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ గ్రామంలోని సయ్యద్ ఖాసీం బీ, సయ్యద్ మాసం బీ 113వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం ముగిశాయి. నస్పూర్ గేట్ నుంచి ఎంతో భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. గంధాన్ని నస్పూర్ గ్రామంలోని వారి సమాధుల వద్ద సమర్పించారు. ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ, అమృత్ 2.0 పథకాల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అంతర్గత రహదారులు, చెత్తా చెదారం లేకుండా పారిశుధ్య పనులను ప్రతి రోజు నిర్వహిం చాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు సమీపిస్తున్నందున వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికా రులు పర్యవేక్షించాని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యం, డీఆర్‌డీవో కిషన్, డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాదు

మందమర్రిటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీ నాయకుడు కాంపెల్లి సమ్మయ్యకు లేదని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలే కరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రోటోకాల్ పాటించలేదని దళిత సంఘాలు ఆందోళన చేసిన విషయం అందరికి తెలిసిందేనన్నారు. ఒక దళిత ఎంపీకి జరిగిన అవమానంపై స్పందించకుండా ఎమ్మెల్యేను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. యూనియన్ నేతగా పనిచేస్తున్న ఆయన యూనియన్‌ను చక్క బెట్టుకుంటే బాగుంటుందని, ఇలా అర్థం లేని విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. జిల్లా నాయకులు సుదర్శన్, నర్సింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అనుమతి లేని బోర్డుల తొలగింపు

లక్సెట్టిపేట(దండేపల్లి), మే 26(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మ్యాదిరిపేట గ్రామంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాల బోర్డులను సోమ వారం పంచాయితీ అధికారులు తొలగించారు. ఈసందర్భంగా పంచాయితీ సెక్రటరీ శ్రావన్ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతులు తీసుకోకుండా అడ్వటైజ్‌మెంట్ బోర్డులు ఎవరూ పెట్టకూడదన్నారు. ఎవరైనా బోర్డులు పెట్టకోవాలంటే జీపీ కార్యాలయంలో దరకాస్తు చేసుకోవాలిన చేసుకన్న దరకాస్తును పరిశీలించి అనుమతులు ఇస్తామన్నారు..

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

భీమారం, మే 26 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. భీమారంలోని గొల్లవాగు ప్రాజెక్టును సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టు లో-లెవెల్ కెనాల్ వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణరెడ్డి, రైతులు తన దృష్టికి తీసుకురావడంతో ప్రాజెక్టు కెనాల్ సందర్శించానని తెలిపారు. హైలెవెల్ కెనాల్‌కు ప్రణాళికలు తయారు చేసి అంచనా వ్యయం ప్రతిపాదనలు పంపాలని సంబంధిత ప్రాజెక్టు అధికారులకు సూచించారు. అనంతరం రైతులు పలు సమస్యలను విన్నవించారు. ఈ క్యాక్రమంలో సీనియర్ నాయకుడు చేకుర్తి సత్యనారాయణ రెడ్డి, పార్టీ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, నాయకులు పోడేటి రవి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రాజెక్టు ఏఈ విష్ణువర్ధన్, డీఈ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ సదానందం, రైతులు మల్లయ్య పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాను

జైపూర్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జైపూర్ ఎన్‌హెచ్ 63 హైవే నుంచి మొదలుకుని మిట్టపల్లి వరకు రూ. 2 కోట్ల సీఆర్‌ఆర్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామస్థులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10 లక్షలకు పెంచి పేద ప్రజలను ఆదుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చెన్నూరు నియోజకవర్గం నుంచి వనరులను దోచుకోవడమే తప్ప అభివృద్ధి చేసింది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు చల్ల విశ్వంభర్‌రెడ్డి పాల్గొన్నారు.



గొల్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి


కాగజ్‌నగర్‌లో పట్టుకున్న నకిలీ విత్తనాల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్ రావు (ఫైల్)

- దాడులు చేస్తున్నా వివిధ మార్గాల ద్వారా తరలింపు
- రైతులకు ఎరవేస్తున్న దళారులు
- నేరుగా గ్రామాల్లోకి డంపింగ్ చేస్తున్న నిర్వాహకులు
- కర్ణాటక, ఖమ్మం, విజయవాడ కేంద్రంగా కొనసాగుతున్న దందా

ఆగని నకిలీ పత్తివిత్తనాల దందా

కాగజ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా ఆగటం లేదు. వ్యవసాయా శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా దాడులు చేస్తున్న కూడా దందా సాగుతోంది. రెండ్రోజుల క్రితం రూ.60లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలు కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇంత భారీస్థాయిలో ఈ దందా కొనసాగుతుందంటే ఏ మేరకు వీరి వ్యాపారం సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రప్రభుత్వం ఈ దందాపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ నిర్వహకులు ట్రాన్స్‌పోర్ట్, రైళ్లు, జాతీయ రహదారి గుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. కర్ణాటక, ఖమ్మం, విజయవాడ కేంద్రంగా ఈ దందాను కొంత మంది దళారులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల రైతులకు చేరవేసేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కర్ణాటక, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో పత్తి విత్తనాలు, ఎరువుల ఫ్యాక్టరీలు ఉన్నాయి. అయితే పత్తి విత్తనాల ఫ్యాక్టరీలో వివిధ కారణాలతో సరిగాలేని విత్తనాలను పక్కన పెట్టేసిన వాటిని కొంత మంది దళారులు బియ్యం సంచుల్లో తెచ్చి అమ్మకాలు చేస్తున్నారు. పేరొందిన కంపెనీలకు దీటుగా నకిలీ అమ్మకాలు చేసి లక్షల రూపాయల్లో లాభాలు గడిస్తున్నారు. సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అధికంగా పత్తి పంటను వేయటంతో అమాయక రైతులకు అంటగట్టేందుకు వర్షాకాలం ముందుగానే గ్రామాల్లో చేరవేసేందుకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నారు. పేరొందిన బ్రాండెడ్ కంపెనీలకు చెందిన 100 గ్రాముల ప్యాకెట్‌కు 500 రూపాయల నుంచి 1200 రూపాయల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఖమ్మం, విజయవాడ నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకొచ్చి కొంతమంది బ్రోకర్లు ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. నకిలీ విత్తనాలు కూడా కిలో చొప్పున ప్యాకెట్లు తయారు చేసి 3000 రూపాయలకు అమ్ముతున్నారు. కొరుచౌకగా గ్రామాల్లోనే లభ్యమవుతుండటంతో వీటినే రైతులు గుట్టుచప్పుడు కాకుండా దళారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఈ విత్తనాలు వాడితే గడ్డిరాదని ప్రచారం చేస్తున్నారు. దీంతో అమాయక రైతులు ఈ విత్తనాలను ఎడాపెడా కొనేస్తున్నారు. కాగా పోలీసు శాఖ, వ్యవసాయా శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టులు నిర్వహిస్తున్న వివిధ దుకాణాలపై కూడా తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీడ్స్ డీలర్లతో కూడా సమావేశం నిర్వహించి అధికారులు అందరిని అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి నకిలీ పత్తివిత్తనాలపై కఠిన చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


చింతమానేపల్లిలో స్వాధీనం చేసుకున్న 300 కిలోల నకిలీ విత్తనాలు(ఫైల్)

ఇటీవల పట్టుబడిన సంఘటనలు..

- కుమురం భీం జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ఏప్రిల్ 4న చింతమానేపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన నకిలీ పత్తివిత్తనాలున్నట్టు పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించగా 300 కిలోల నకిలి పత్తి విత్తనాలు లభించాయి. ఈ దందాను కొనసాగిస్తున్న ఆసిఫాబాద్‌కు చెందిన లోకండే భిక్షపతి, గుంటూరుకు చెందిన సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు.
- కాగజ్‌నగర్ పట్టణంలో మూడు రోజుల క్రితం నవత ట్రాన్స్‌పోర్టుపై టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 45 కిలోల నకిలీ బీటీ విత్తనాలు లభ్యం కావటంతో వీటిని తెచ్చిన కుశ్నపల్లి నివాసి చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.1.57లక్షలున్నట్టు తేల్చారు. ఈ సంఘటనతో పోలీసులు, వ్యవసాయాధికారులు జిల్లాలో అన్నీ ట్రాన్స్‌పోర్టర్లపై దాడులు నిర్వహించారు.
- మూడు రోజుల క్రితం పెద్దవాగు నుంచి కాగజ్‌నగర్‌కు వస్తున్న ఏపీ38టీవై9741 నంబర్ గల వాహనాన్ని తనిఖీ చేసి 20 క్వింటాళ్ల బీటీ3 రకం నకిలీ విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.60లక్షల మేర ఉంటుంది. ఈ కేసులో కాగజ్‌నగర్ కాపువాడలో నివాసం ఉండే కొత్తపల్లి సదాశివ్ అనే వ్యక్తితో పాటు లక్ష్మణ్, సంతోష్ కిషోర్, వేణుగోపాల్‌రెడ్డిపై కేసులు కూడా నమోదు చేసినట్టు ఎస్పీ శ్రీనివాసరావు ప్రకటించారు.

తరుచుగా పట్టుబడితే పీడీ యాక్టు

- డీఎస్పీ రామానుజం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామానుజం

సిర్పూర్(టి)(ఆంధ్రజ్యోతి): నిషేధిత వస్తువులు రవాణా చేస్తూ తరుచుగా పట్టుబడితే వారిపై పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. ఆదివారం మండలంలోని భూపాలపట్నం గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు వారు తెలిపిన వివరాలను సోమవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వివారలను డీఎస్పీ వెల్లడించారు. సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామంలో 75 కిలోల నకిలీ పత్తి విత్తనాలు అదే గ్రామానికి చెందిన బోయినపల్లి అశోక్ ఇంట్లో దొరికినట్లు తెలిపారు. అశోక్‌ను అదుపులోకి తీసుకు విచారించగా 20 రోజుల క్రితం బెజ్జూరు మండలం సుస్మీర్‌కు చెందిన తలండి సురేష్, ఎడ్మ ప్రశాంత్‌లతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోరంట్ల సురేష్ అనే వ్యక్తి వద్ద మూడు క్వింటాళ్ల నకిలీ విత్తనాలు కొనుగోలు చేశారన్నారు. అందులో నుంచి రైతులకు ఇప్పటి వరకు రెండు క్వింటాళ్ల విత్తనాలు అమ్మారని, మిగిలిన విత్తనాలను భూపాలపట్నం ఉంచినట్లు తెలిపారు. ఈ మేరకు సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ విత్తనాలను పట్టుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్సైతో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐ రమేష్, ఎస్సై కమలాకర్, ఏఎ గిరీష్‌కుమార్ ఉన్నారు.

ప్రజల చెంతకు పంచాయతీ వివరాలు

- పారదర్శకతకు ప్రాధాన్యం
- అందుబాటులోకి మేరి పంచాయతీ యాప్


వాంకిడి గ్రామపంచాయతీ కార్యాలయం
మేరి పంచాయతీ యాప్

వాంకిడి, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ల ఆదాయ, వ్యయాల విషయంలో పారదర్శకత పాటించేలా కేంద్ర ప్రభుత్వం మేరి పంచాయతీ(నా పంచాయతీ) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయాలకు వెళ్లకుండానే ఈ యాప్ ద్వారా పరిశీలించవచ్చు. పంచాయతీలకు సంబంధించిన పద్దుల వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను 2019లోనే రూపొందించగా పలు కారణాలతో వివరాలన్నింటిని నిక్షిప్తం చేయలేదు. ప్రస్తుతం ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. పంచాయతీలకు సంబంధించిన నిధుల వివరాలే కాకుండా సర్పంచ్, కార్యదర్శి గ్రామకమిటీలు, ఆస్తుల సమాచారాన్ని సైతం యాప్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సంవత్సరం మంజూరు చేసే నిధుల వివరాలతో పాటు ఏఏ పనులకు ఎంత మొత్తం వెచ్చించారు, పనులు ఏఏ దశల్లో ఉన్నాయనే సమాచారం యాప్‌లో చూసుకునే వెసులుబాటు కల్పించారు. పంచాయతీ వ్యయాలు ముఖ్యంగా కార్మికుల, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులను ఇందులో పొందుపరుస్తున్నారు. అంతే కాకుండా వచ్చే ఏడాదికి సంబంధించిన అంచనా వ్యయాలను నమోదు చేస్తారు. పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల వివరాలను సైతం నిక్షిప్తపరుస్తున్నారు.

జిల్లాలో గ్రామపంచాయతీలు, వార్డుల వివరాలు

గ్రామపంచాయతీలు	వార్డులు
335	2,874

డౌన్‌లోడ్ ఇలా చేసుకోవాలి...

ప్లేస్టోర్‌కు వెళ్లి మేరి పంచాయతీ అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం యాప్‌లో లాగిన్ కావాలి. దీన్ని ఓపెన్ చేయగానే ఆర్థిక సంవత్సరం, రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనపడతాయి. వాటిని నమోదు చేయగానే పంచాయతీలకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. గ్రామం పేరు లేదా పిన్‌కోడ్‌తో సైతం సంబందిత పంచాయతీ వివరాలను తెలుసుకునే వీలుంది.

పారదర్శకతకు ప్రాధాన్యం...

పంచాయతీ నిధుల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయడంద్వారా పాలనలో పారదర్శకత పెరుగుతందని అధికారులు చెబుతున్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వాలు ఎలాంటి పనులు చేపడుతున్నాయనేది ప్రజలు సులువుగా తెలుసుకోవచ్చు. గ్రామంలో చేపట్టే పనులను జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తింస్తుండడంతో ఒక్కసారి నిధులు మంజూరైన పనికి మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలుండదు. పద్దుల వివరాలు ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా పాలకవర్గాలు పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. ఒకవేళ తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రజలు ప్రశ్నించేందుకు అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ హైమద్


మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, పక్కన డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), మే 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు అని, స్థానిక ఎన్నికల్లో గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్, సాధారణ ఎన్నికల పరిశీలకులు రియాజ్ హైమద్ అన్నారు. సోమవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తలు, నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలు, మండలాల్లో కాంగ్రెస్ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో యువతకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తుందన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో బస్టాండు నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేయిస్తానని అన్నారు. మండల, గ్రామ, బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు షకీల్ అహ్మద్, సిడాం గణపతి, సోహెల్ అహ్మద్, తులసీరాం, అబ్దుల్ అకీల్, రాజు, శంకర్, రవీందర్, సత్యనారాయణ, ముంతగిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా

దహెగాం (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం దహెగాం మండలం ఇట్యాలలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌తో కలిసి మాట్లాడారు. గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణం, ఎన్నికల ఎత్తుగడలు, రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, నాయకులు శ్రీరామరావు, సురేష్, నాగేష్‌గౌడ్, శ్రీనివాస్, భీమన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల ను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన దరఖాస్తులు..

- కాగజ్‌నగర్ పట్టణంలోని ఇర్ఫాన్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ తన ఇంటి వద్ద ఉన్న మురుగు కాలువను ఆక్రమించడంతో మురుగు నీరు తన ఇంట్లోకి వస్తుందని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు.
- తన తండ్రి పేరిట గల భూమిని ఇతరులు ఆక్రమించారని, ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ కౌటాల మండలం కన్కి గ్రామానికి చెందిన లక్ష్మయ్య అర్జీ సమర్పించారు.
- ఆసిఫాబాద్ మండలం చోర్‌పల్లికి చెందిన మల్లన్న గ్రామ శివారులో ఉన్న తనకు భూమిని కొందరు ఆక్రమించారని న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన కవిత మండల్ తాను పోస్టు ఆఫీసులో చేసిన లక్ష రూపాయల డిపాజిట్‌ను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
- సిర్పూర్(యూ) మండలం రాఘవపూర్ పంచాయతీలోని మారుగూడ గ్రామస్థులు తాగునీటిని అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- వాంకిడి మండల కేంద్రంలోని కేబీనగర్ కాలనీకి చెందిన వాసులు తమ ఇళ్ల పైనుంచి విద్యుత్ తీగలు ఉన్నాయని వెంటనే తొలగించాలని అర్జీ సమర్పించారు.
- తన కూతురు పిడుగుపాటుతో మరణించిందని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ బెజ్జూరు మండలం పోతెపల్లికి చెందిన చంద్రయ్య దరఖాస్తు అందజేశారు.
- రెబ్బెన మండలం గోలేటిలోని గౌతమ్‌నగర్‌లో నివాసం ఉంటున్న సురేందర్ తిర్యాణి మండలం దేవాయిగూడలోని తమ ఇంటిని సింగరేణి ఉపరిత గనిలో కోల్పోయానని నష్టపరిహారం అందించి ఉపాధ కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

చలో కలెక్టరేట్ పోస్టర్ల ఆవిష్కరణ

కాగజ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలి పెంచాలని కోరుతూ ఈ నెల 30న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీకి 600 రూపాయలు ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు పెంచాలన్న డిమాండుతో ధర్నా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

బుద్ధ విగ్రహం తొలగింపుపై మంత్రి స్పందించాలి

వాంకిడి, మే 26 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని రాళ్లబోరిగాం గ్రామంలో ఈ నెల 12న బుద్ధ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహం తొలగింపుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క వెంటనే స్పందించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు అశోక్, సందీప్, మహేష్, వినేష్, విజయ్, రోషన్, శ్యాంరావు, చింటు డీలాజీ, పోచాలు, అన్నారావు, బలవంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీసు శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందు పరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 12 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన ఫిర్యాదుల సమస్యలను వెంటనే పరిష్కరించేట్టు చూడాలని ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు, అర్జిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల సమస్యలు సంబంధిత శాఖల అధికారుకు పంపించటం జరుగుతుందన్నారు. వీటిని పరిష్కరించేందుకు అధికారులు నిర్లక్ష్యం వహించకుండా చూసుకోవాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో భూ సమస్యలు, పెన్షన్, రేషన్ కార్డులిప్పించాలని కోరుతూ పలువురు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతి పత్రాలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, మే 26(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉట్నూరు కుమరం భీం గ్రామీణ స్వయం ఉపాధి శిక్ష సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి, 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు లోపు గల వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం 9949412159, 8985633226 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జమిలీ ఎన్నికల ద్వారానే అభివృద్ధి సాధ్యం

ఆసిఫాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): జమిలీ ఎన్నికలు జరిగితేనే దేశం మరింత అభివృదితి సాధిస్తుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఉద్యోగులు, మేధావులు, వ్యాపారస్తులు, ప్రజలు, సీనియర్ అడ్వకేట్‌లు, వైద్యులు, విద్యార్థులతో జమిలీ ఎన్నికలపై అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలంతో కలిసి హాజరై నాగేశ్వర్‌రావు మాట్లాడారు. దేశంలో వేర్వేరుగా ఎన్నికలు చేపట్టడం ద్వారా ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, విజయ్, సొల్లు లక్ష్మి, దీపక్‌రావు, ప్రసాద్‌గౌడ్, పెంటయ్య పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ టీచర్లను రెన్యూవల్ చేయాలి

ఆసిఫాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): ఎలాంటి డెమో లేకుండా పార్ట్‌టైం టీచర్లను రెన్యూవల్ చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సంతోష్‌చారికి సోమవారం పార్టుటైం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి ఇదే సంస్థలో పనిచేస్తున్నామని, తమను రెన్యూవల్ చేయకపోతే కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఎలాంటి డెమోలు నిర్వహించకుండా కొత్తవారికి అవకాశాలు కల్పించకుండా తమను రెన్యూవల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టుటైం టీచర్లు పాల్గొన్నారు.